# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్ధమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

## *డిసెంబర్ 32*

## *మోరిస్ గ్రీన్ అండ్ విలియం వాకర్ కథకి స్వేచ్ఛానువాదం*

**డిసెంబర్ 31,** 2008న నిద్రలేచినప్పుడు తను శాశ్వతంగా జీవిస్తాడని అతనికి తెలీదు.

కాలం అనేది కొండ మీంచి దిగే బ్రేకుల్లేని కారులా ఆగదు అని అనుకుంటారు. కాని అతని అనుభవం మరోలా ఉంది.

జో తాకట్టు పెట్టడానికి తన భార్య మార్లీ నించి బంగారు ఉంగరం తీసుకెళ్ళి ఉండకపోతే అతనికీ అనుభవం కలిగేది కాదు. అవును. జో జూదగాడు. తను చేసిన అప్పులని తీర్చడానికి ఆమెని అడిగి ఆ వజ్రపుటుంగరం తీసుకున్నాడు.

"మార్లీ. నీ ఉంగరంలోని వజ్రం వదులైంది అన్నావు. ఇస్తే, ఆఫీస్‌కి వెళ్తూ దాన్ని జువెలరీ షాప్‌లో ఇచ్చి తిరిగి వస్తూ తీసుకు వస్తాను" ఆ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ జో చెప్పాడు.

"జో! మళ్ళీ జూదం ఆరంభించావా?" వెంటనే మార్లీ బాధగా అడిగింది.

"అబ్బే లేదు" అబద్దమాడాడు.

"నీ వాచీని తాకట్టు పెట్టినప్పుడు కూడా ఇదే మాటన్నావు. మన మొదటి ఏనివర్సరీకి నీకు బహుమతిగా ఇచ్చిన ఏనుగు దంతం కఫ్‌లింగ్స్ విషయంలో కూడా ఇదే చేసావు."

"తాకట్టు పెట్టనన్నాగా."

"సరే. కాని గుర్తుంచుకో. అది చాలా విలువైన ఉంగరం. నీకు కాకపోయినా నాకు. ఎందుకంటే అది మన ఎంగేజ్‌మెంట్ ఉంగరం" చిన్నగా నిట్టూర్చి చెప్పింది.

తనా అప్పుని ఆ రాత్రి పన్నెండులోగా తిరిగి చెల్లించకపోతే ఆ వడ్డీ వ్యాపారి ఊరుకోడు. రౌడీలని పంపి దేహశుద్ధి చేయిస్తాడని జోకి తెలుసు. కాబట్టి విధి లేక అబద్దం చెప్పి భార్య నించి ఆ ఉంగరం తీసుకున్నాడు.

తాకట్టు దుకాణంలో విండోలోని ఆ గడియారం చూడగానే జోని బాగా ఆకర్షించింది. అది పాతకాలం గడియారమని తెలిసిపోతోంది. దాని మీద అనేక రకాల డయల్స్ కనిపించాయి. తర్వాత ఎవెన్యూ పేరు గల ఆ షాప్‌లోకి వెళ్ళాడు.

"ఆ గడియారం మీద మీకు ఆసక్తి ఉందా?" షాప్ యజమాని చిరునవ్వుతో పలకరించి అడిగాడు.

"లేదు. బావుందది. ఈ ఉంగరం మీద ఎంతిస్తారు?" జో అడిగాడు.

"ఐదు వందల డాలర్లు" దాన్ని పరిశీలించి చూసి చెప్పాడు.

"ఐదు వందలా? దీని ధర ఐదువేల డాలర్లు. ఇంకో షాప్‌లో కనీసం ఎనిమిది వందలు ఇస్తారు."

"ఐతే నా దగ్గర ఐదు వందలు తీసుకోవడం మూర్ఖత్వం. ఆ ఇంకో షాప్‌కే వెళ్ళండి" అతను మృదువుగా చెప్పాడు.

"ఎంత ఇవ్వగలరు?"

"ఐదు వందలు."

"ఇవ్వండి."

అతను బిల్ రాసేలోగా జో మరోసారి ఆ గడియారాన్ని పరిశీలించాడు. నెల, చంద్రుడు, సూర్యుడు, నవగ్రహాలు డయల్స్ ఉన్నాయి. కొన్ని డయల్స్ దేనికో అర్థం కాలేదు. వాటి మీద ఈజిప్షియన్ హైరోగ్రాఫిక్ బొమ్మల రాత కనిపించింది. తను తప్పకుండా దాన్ని కొనాలనే తీవ్రవాంఛ జోలో కలిగింది.

"ఈ డయల్స్ ఏమిటి?" అడిగాడు.

"ఈ గడియారం చాలా రకాలుగా సమయాన్ని కంట్రోల్ చేయగలదని దీన్ని తాకట్టు పెట్టినతను చెప్పాడు. కోరినట్లుగా ఈ గడియారం సమయాన్ని మెల్లగా లేదా వేగంగా సాగేలా చేయగలదని చెప్పాడు. ఇనప పెనం మీద కూర్చున్న వ్యక్తికి క్షణం సంవత్సరంలా గడిస్తే, శృంగారంలో పాల్గొనేవాడికి సంవత్సరం క్షణంలా గడుస్తుంది."

"ఈ వాచీకి ఎంత అడుగుతున్నారు?"

"ఐదు వందల డాలర్లు."

ఫోన్ మోగింది. షాప్ కీపర్ వెళ్ళి రిసీవర్ అందుకుని అవతల నించి చెప్పేది విని అడిగాడు.

"మీ పేరు జో హెడ్కాకా?"

"అవును. ఎందుకు?" జో అడిగాడు.

"ఎస్. మిస్టర్ హెడ్కాక్ ఇక్కడే ఉన్నారు. మీ పేరు?"

లైన్ కట్ అవడంతో షాప్ యజమాని రిసీవర్ని క్రెడిల్ మీద ఉంచాడు.

"చిత్రం! నేను ఇక్కడికి వస్తున్నట్లు ఎవరికీ తెలీదు. ఎవరది?" జో అడిగాడు.

"చెప్పలేదు. 'అతను నేను చెప్పేది నమ్మడు' అని లైన్ కట్ చేసేసాడు."

"వింతగా ఉంది. సరే ఈ గడియారాన్ని నేను తీసుకుంటాను. ఎందుకో తెలీదు కాని ఇది నాకు కావాలనిపిస్తోంది" జో చెప్పాడు.

అతను ఇచ్చిన ఐదువందల డాలర్లని వెనక్కి ఇచ్చేసి, షాప్లోంచి బయటకి వచ్చిన కాసేపటికి తను దాన్ని కొని పిచ్చి పని చేసాడని అనిపించింది. ఆ ఐదు వందల డాలర్లతో అప్పు చెల్లించకపోతే తనకి దేహశుద్ధి తప్పదు.

వెంటనే షాప్లోకి వెళ్ళి అతనితో చెప్పాడు.

"నేను పొరపాటు చేసాను. దీన్ని వెనక్కి తీసుకుని నా డబ్బు వెనక్కి ఇవ్వండి."

"ఇది నా గడియారం కాదు. మీది. దీన్ని మీరు కొన్నారు" ఆ షాప్ యజమాని చెప్పాడు.

"కానీ నాకీ గడియారం వద్దు. నా డబ్బు నాకు వెనక్కి కావాలి."

"అమ్మకం అమ్మకమే. దీన్ని అమ్మాలంటే మీరు కొనుగోలుదారుడ్ని వెదకండి. నేను కొనుగోలుదారుడ్ని కాను."

"కాని నాకా డబ్బు అవసరం."

"కావాలంటే దీన్ని తాకట్టు పెట్టుకుంటాను."

"ఎంతిస్తారు?"

"ఐదు డాలర్లు."

"ఐదు డాలర్లా? దీన్ని కొన్ని నిమిషాల క్రితమే ఐదు వందల డాలర్లకి అమ్మారు?"

"దురదృష్టవశాత్తు ఇప్పుడు ఈ గడియారం అంత విలువైందని నేను భావించడంలేదు.

వెంటనే జో అప్పు కోసం తన బేంక్ మేనేజర్, మిత్రుల దగ్గర ప్రయత్నించాడు. అంతా నో చెప్పారు. ఇంక ఏం చేయాలో తోచక ఇంటికి వెళ్ళాడు.

అతను టీ కలుపుకుని తాగుతూంటే గడియారంలోంచి గంట వినపడి ఓ కంఠం చెప్పింది.

"సమయం రెండున్నర."

కనీసం గడియారం సరిగ్గా పని చేస్తోందని జో తృప్తి చెందాడు. దానికున్న అనేక మీటలని చూసి అవి దేనికో తెలుసుకోవాలని అనుకుని ఓ మీటని నొక్కాడు.

అకస్మాత్తుగా సూర్యుడు మాయమై అంతా చీకట్లు అలుముకోవడంతో నిర్ఘాంతపోయాడు. బయట మంచు కూడా కురుస్తోంది. గడియారంలోని తారీకు డిసెంబర్ 28 మీదకి మళ్ళిందని గమనించాడు. ఆదివారం 28వ తారీకు మంచు కురవడం గుర్తొచ్చింది. ఈ గడియారానికి సమయాన్ని వెనక్కి తీసుకెళ్ళే శక్తి ఉందా? తారీకుని మళ్ళీ 31కి తీసుకువచ్చాడు. తిరిగి సూర్యుడు ఆకాశంలో ప్రకాశించసాగాడు. కిటికీలోంచి చూస్తే, నేల మీద మంచు కురిసిన జాడలే లేవు. గడియారం కాలాన్ని వెనక్కి తిప్పిందో లేదా తనకి పిచ్చెక్కుతోందో జోకి అర్థం కాలేదు. మరోసారి దాన్ని పరీక్షించాలని అనుకున్నాడు.

తనా రోజు తాకట్టు దుకాణానికి ఒంటి గంటకి వెళ్ళాడు. వాచీ టైంని 12.45కి వెనక్కి తిప్పాడు. తర్వాత ఆ పాన్ షాప్ నంబర్ ఫోన్ చేసాడు.

"హలో. అది థర్డ్ ఎవెన్యూలోని పాన్ షాపే కదా?"

"అవును."

"అక్కడ జో హెడ్ కాక్ ఉన్నాడా?" అడిగాడు.

"ఒక్క నిమిషం సార్. మీ పేరు జో హెడ్ కాకా?" అతని కంఠం వినిపించింది.

"అవును. ఎందుకు?" జోకి తన కంఠమే దూరం·నించి వినిపించింది.

'నేను చెప్పినా అతను నమ్మడు' అని చెప్పి లైన్ కట్ చేసాడు.

అతను చెప్పినట్లుగా ఆ గడియారం టైంని కంట్రోల్ చేస్తుందని గ్రహించాక జోకి దాని శక్తి అర్థమైంది.

అతను దాన్ని ఉపయోగించి ఎలా డబ్బు సంపాదించాలా అని కొద్దిసేపు ఆలోచించాడు. డబ్బుండేది బేంక్‌లోనే.

వెంటనే బేంక్‌కి వెళ్ళాడు. తన సేఫ్ డిపాజిట్ బాక్స్‌ని ఆపరేట్ చేయడానికి సంతకం చేసి, అదున్న గదిలోకి వెళ్ళాడు.

తర్వాత ఆ గడియారాన్ని ఆదివారం, 28వ తారీకున మధ్యాహ్నం రెండుకి తిప్పాడు. బయటకి తొంగి చూస్తే బేంక్ ఖాళీగా ఉంది. అది పని చేసింది.

బేంక్ వాల్ట్‌లోని డబ్బు కట్టలని తీసి జేబులో దోపుకున్నాడు. మళ్ళీ గడియారాన్ని ఆ టైంకి మార్చి వాల్ట్ లోంచి బయటకి నడిచాడు. బయట మేనేజర్ చెప్పాడు.

"హేవ్ ఏ ప్రాస్పరస్ న్యూ ఇయర్ మిస్టర్ హెడ్ కాక్"

"థాంక్స్. మీ విషెస్ ఈ సంవత్సరం తప్పక ఫలిస్తాయని నాకు తెలుసు" జో ఆనందంగా చెప్పి బయటకి నడిచాడు.

"మార్లీ! మార్లీ! ఇదిగో చూడు. మనం ధనవంతులయ్యాం" ఆఫీస్ నించి తిరిగి వచ్చిన తన భార్యకా డబ్బు కట్టలని చూపించాడు.

"ఎక్కడిది ఇంత డబ్బు? బేంక్ దొంగతనం చేసారా?" మార్లీ అడిగింది.

"అవును. నీకెలా తెలుసు?"

"కమాన్ జో. నిజం చెప్పు. ఇంత పెద్ద మొత్తం నీకు ఎక్కడిది?"

"చెప్పాగా బేంక్ దొంగతనమని. మనకి డబ్బు అవసరం వచ్చినప్పుడల్లా ఇకనించి దొంగతనం చేస్తూనే ఉంటాను. ఏదోరోజు అదృష్టం నా తలుపు తడుతుందని అనేకసార్లు చెప్పానా? ఈ రోజది మన తలుపు తట్టింది. వెళ్ళి కొత్త డ్రస్ కొనుక్కో. న్యూ యియర్ని పెద్ద హోటల్లో సెలబ్రేట్ చేసుకుందాం" ఆనందంగా చెప్పాడు.

"హేపీ న్యూ ఇయర్ జో" అర్ధరాత్రి పన్నెండుకి మార్లీ జోకి చెప్పింది.

"థాంక్ యు. సేమ్ టు యు. మార్లీ! ఒక్క నిమిషంలో వస్తాను" చెప్పాడు.

"ఎక్కడికి?"

"ఎదురు సందులో ఒకర్ని కలిసి డబ్బు ఇచ్చి రావాలి."

"మళ్ళీ జూదం అప్పా? నా ఉంగరమేది?" మార్లీ నిగ్గదీసింది.

"తాకట్టు షాప్‌లో ఉంది. రేపు విడిపిస్తాను."

"జో! నీతో నేను విసిగిపోయాను. గుడ్ బై" చెప్పి కోపంగా బయటకి వెళ్ళే ఆమెతో జో చెప్పాడు.

"వెళ్ళొద్దు మార్లీ. మనం ధనవంతులయ్యాం. ఇంకెన్నటికీ జూదం ఆడను. రేపు ఉదయం నీ ఉంగరం తెచ్చి నీకు ఇస్తాను. నిజానికి అలాంటి డజను ఉంగరాలని కొనగలను."

రోడ్ మీద ఆమెని ఆపడానికి చెయ్యి పట్టుకుని పెనుగులాడాడు. అకస్మాత్తుగా ఆమె అతన్ని తోసింది. వెంటనే అతను కింద పడ్డాడు.

తక్షణం నిశ్శబ్దం.

భయంకర నిశ్శబ్దం

ఆ నిర్మానుష్య వీధిలో తనొక్కడే ఉన్నాడని లేచాక గుర్తించాడు.

"మార్లీ" అరిచాడు. జవాబు లేదు.

"అంతా ఎక్కడ ఉన్నారు?" మళ్ళీ అరిచాడు.

జవాబు లేదు.

అతనికి అంతా వింతగా, కొత్తగా అనిపించింది. అతని దృష్టి గడియారం మీద పడింది.

అది సమయం రాత్రి ఎనిమిదిన్నర చూపిస్తూండటంతో అది జనవరి 1 అయి ఉండచ్చని అనుకున్నాడు. చూస్తే తారీకు డయల్‌లో డిసెంబర్ 32 కనిపించింది. డిసెంబర్ 32 అంటూ ఉండదు కాబట్టి దాన్ని డిసెంబర్ 31కి మళ్ళీ రీసెట్ చేసే ప్రయత్నం చేసాడు. కాని ముల్లు కదలేదు. తను నేలకి తాకినప్పుడు ఆ గడియారానికి దెబ్బ తగిలిందని గుర్తించాడు. తను డిసెంబర్ 32 నించి ఓ రోజు వెనక్కో, ముందుకో వెళ్ళాలని అనుకున్నాడు.

దాన్ని బాగు చేయాలని వెనకాల ఇత్తడి డిప్పని తొలగించి చూసాడు. ఆశ్చర్యంగా లోపలంతా ఖాళీ. యంత్రం లేదు.

తను శాశ్వతంగా డిసెంబర్ 32లో ఉండిపోతాడని జో గ్రహించాడు.

Post your comments

**(వచ్చేనెల మరోకథ)**